క్లుప్తంగా

తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులు



పైప్‌లైన్ మరమ్మతులు చేయిస్తున్న అధికారి

బాడంగి: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఎదురుగా మెయిన్‌రోడ్డు పక్కన ఉన్న తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులు శనివారం చేపట్టారు. ఇదే పైప్‌లైన్ ద్వారా దత్తిరాజేరు మండలంతో పాటు బాడంగి, తెంటువలస, పెద్దపల్లి, వీరసాగరం ప్రాంతాలకు నీటి సరఫరా జరుగుతోంది. అయితే ఇక్కడి పైప్‌లైన్‌కు లీకు పడడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. స్పందించిన సంబంధిత అధికారులు చొరవ తీసుకుని మరీ ఉదయం బాగు చేయించి, నీటి సరఫరాను పునరుద్ధరించారు.

అభ్యంతరాలుంటే తెలియజేయండి



వంగర: అరసాడ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన తహసీల్దారు ధర్మరాజు

వంగర: ఓటర్ల జాబితా ముసాయిదాకు సంబంధించి, ఏవైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే తెలియజేయాలని తహసీల్దారు దిరిశాల ధర్మరాజు సూచించారు. మండలంలోని అరసాడ పోలింగ్ కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. అక్కడి ఓటర్లు బీఎల్‌వోల దృష్టికి తీసుకువచ్చిన పలు అభ్యంతరాలు, కొత్త ఓటరు దరఖాస్తులను ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఆదివారం కూడా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం కొనసాగుతుందని, అర్హులైన వారంతా ఓటర్లుగా నమోదు కావాలని కోరారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు



అవగాహన కల్పిస్తున్న రాజాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ జైభీమ్

రాజాం: మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాజాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఆర్.జైభీమ్ హెచ్చరించారు. మండలంలోని పొగిరి గ్రామంలో పాన్‌షాపుల యజమానులు, పలువురు చిరువ్యాపారులతో శనివారం మాట్లాడిన ఆయన.. ఎట్టి పరిస్థితుల్లోనూ బెల్టు షాపులు నిర్వహించడానికి వీల్లేదన్నారు. ఎక్కడైనా ఎవరైనా బెల్టుషాపులు నిర్వహిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

బొబ్బిలిరూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఈ నెల 16వ తేదీన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో చేపట్టే చలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించి, రూపొందించిన వాల్‌పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. మాదిగల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టే ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కన్వీనర్ సురగాల లక్ష్మణరావు కోరారు. కార్యక్రమంలో గర్భాపు రమేష్, పిల్లి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి



వాహనదారులకు సూచనలిస్తున్న సీఐ ఉపేంద్ర

సంతకవిటి: వాహనదారులంతా తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని రాజాం రూరల్ సీఐ సీహెచ్ ఉపేంద్ర సూచించారు. మండలంలోని గుళ్లసీతారాంపురం గ్రామ ప్రధాన కూడలిలో డ్రైవింగ్ లైసెన్స్ పొందే విధానంపై శనివారం అవగాహన కల్పించారు. వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు ప్రతీ వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌ను వెంట తీసుకురావాలని తెలిపారు.

రామాయణ ఘట్టాలపై చిత్రలేఖన పోటీలు

రాజాం సిటీ: విద్యార్థులు చిన్నతనం నుంచే విలువలు తెలుసుకుని, పాటించాలని రాజాం రూరల్ సీఐ హెచ్ ఉపేంద్ర సూచించారు. స్థానిక వికాస తరంగిణి కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు రామాయణంలోని ఘట్టాలపై చిత్రలేఖనం పోటీలు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. సమాజంలో ప్రతి ఒక్కరి పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. తల్లిదండ్రులే చిన్నారులకు మంచిచెడులు నేర్పాలన్నారు. కార్యక్రమంలో వికాస తరంగిణి గౌరవాధ్యక్షుడు టీటీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


మడ్డువలస అందాలు చూసొద్దాం రండి!



వంగర: మడ్డువలస రిజర్వాయరు

- ప్రకృతి రమణీయతకు నెలవు.. మడ్డువలస
- పర్యాటకులను మైమరిపిస్తున్న అందం, ఆహ్లాదం
- రిజర్వాయర్‌కు పోటెత్తుతున్న సందర్శకులు
- పిక్నిక్‌లకు అనువైన ప్రదేశంగా గుర్తింపు
- ఆధ్యాత్మిక ప్రదేశాలకూ ప్రసిద్ధి

వంగర: ప్రకృతి రమణీయతకు నెలవుగా మండలంలోని మడ్డువలస ప్రాంతం మారింది. చుట్టూ ఎత్తైన కొండలు.. పచ్చని పంటపొలాలు, నిండుకుండలా దర్శనమిచ్చే రిజర్వాయరుతో కూడిన ఆహ్లాదకర వాతావరణం అటువైపుగా వెళ్లే వారి మదిని ఇట్టే దోచేస్తాయి. ఇదే ప్రాంతం పిక్నిక్ స్పాట్‌గా కూడా ప్రసిద్ధి కావడంతో కార్తీకమాసంలో పిక్నిక్‌లు చేసుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి తరలివస్తారు. ప్రధానంగా రిజర్వాయరు ప్రవేశ రోడ్డుకు ఇరువైపులా ఉండే చెట్లు.. వీచే చల్లని గాలి.. ఆహ్లాదం పంచుతుండగా, అక్కడే ఉన్న షిర్డీ సాయినాథుని మందిరం అక్కడికి వచ్చే వారిలో ఆధ్యాత్మికతను పెంపొందిస్తుండడం విశేషం. ఓ వైపు ఆధ్యాత్మికం.. మరోవైపు పర్యాటకం..అనే భావన అక్కడికి వెళ్లిన ప్రతిఒక్కరిలో కలుగుతుంది. ఈ నేపథ్యంలో ఒక్కసారైనా మడ్డువలస అందాలు చూసొద్దామని అందరూ అనుకుంటుండడం గమనార్హం.



వంగర: మడ్డువలస కొండపై పూజలందుకుంటున్న సాయినాథుడు

వేలాది మంది సందర్శకులు..

రిజర్వాయరు జలకళను చూసేందుకు చాలామంది ఇష్టపడుతుంటారు. ప్రాజెక్టు ముందు భాగం బకెట్ పోర్షన్‌లో నీరు ప్రవహిస్తుండడాన్ని ప్రత్యేకంగా తిలకించేందుకు అందరూ వస్తుంటారు. ఏటా కార్తీకమాసంలో విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి వేలాది మంది ప్రాజెక్టు సందర్శనకు తరలివస్తారు. ప్రాజెక్టు ప్రాంగణం సహా సమీప తోటలను పిక్నిక్ స్పాట్‌లుగా చేసుకుని వనభోజనాలు చేస్తారు. అనంతరం సాయంత్రం వేళల్లో అక్కడ నెలకొనే ప్రకృతి సౌందర్యాన్ని తిలకించి, మనసారా ఆస్వాదిస్తారు.

చూడాల్సిన ప్రదేశాలు..

రిజర్వాయరు, ప్రాజెక్టు ఆవరణలోని డైక్, కొండపైన సాయినాథుని ఆలయం, ఇక్కడకు కిలోమీటరు దూరంలోని కొండపై ఉన్న పాండవుల పంచ(గుహ)ను మనం చూడొచ్చు. అలాగే మడ్డువలస గ్రామానికి ఆనుకుని ఉన్న పచ్చని తోటలు, పంటపొలాలు సందర్శకులను ఆకర్షిస్తాయి.

సందర్శకులు పాటించాల్సిన జాగ్రత్తలు..

ఇక్కడ సందర్శకులు జాగ్రత్తలు పాటించాలి. ప్రాజెక్టు వద్ద బకెట్ పోర్షన్ వద్దకు వెళ్లకూడదు. ఈ ప్రాంతం చాలా లోతుగా ఉంటుంది. ప్రాజెక్టు రివిట్‌మెంట్, డైక్ వాల్ ముందరకు వెళ్లి ప్రాజెక్టులోకి దిగే ప్రయత్నం చేయరాదు. ప్రాజెక్టుపై నడిచిచేటపుడు జాగ్రత్తగా వెళ్లాలి. గేట్లు సమీపంలో కిందకు వెళ్లకూడదు. విద్యా సంస్థలు సమూహంగా వచ్చేటపుడు విద్యార్థులు ఒకే సమూహంగా ఉండాలి. కుటుంబాలతో వచ్చేవారు చిన్నారులను విచ్చలవిడిగా వదలకూడదు. ప్రాజెక్టు వద్ద స్నానాలు చేయకూడదు. గతంలో ప్రాజెక్టును తిలకించడానికి వచ్చి ప్రమాదాలు జరిగి మృత్యువాత పడిన సందర్భాలు ఉన్నాయి.

దగ్గరలో మరిన్ని పుణ్యక్షేత్రాలు..


మడ్డువలస రిజర్వాయరు నుంచి సంగాం గ్రామానికి 6 కిలోమీటర్ల దూరం. ఇక్కడి సంగమేశ్వరాలయంలో ద్వాపరయుగంలో బలరాముడు ప్రతిష్ఠించిన శివలింగం ప్రత్యేకం. ఇదే ప్రాంతంలోని త్రివేణి సంగమం(వేగావతి, సువర్ణముఖి, నాగావళి నదులు కలిసే ప్రదేశం) పవిత్ర కార్తీక స్నానాలకు ప్రసిద్ధి. ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ తర్వాత ఆ తరహా త్రివేణి సంగమం ఉన్నది ఇక్కడే. ఆలయం వద్ద 400 ఏళ్ల క్రితం నాటి ఓ భారీ మర్రివృక్షం కూడా వీక్షించొచ్చు. వీటితో పాటు ఎం.సీతారాంపురంలోని 108 స్తంభాల శ్రీఉమారామలింగేశ్వరస్వామి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం కూడా ఉంది.

ఇలా వెళ్లొచ్చు..

మడ్డువలస రిజర్వాయర్‌కు బస్సు, ఆటోలను ఆశ్రయించి చేరుకోవచ్చు. రాజాం పట్టణానికి సరిగ్గా 21 కిలోమీటర్ల దూరంలో మడ్డువలస ఉంది. రూ.30 ప్రయాణపు చార్జీ అవుతుంది. రాజాం నుంచి బస్సులు తక్కువే అయినా వంగర, కొప్పర, రుషింగి గ్రామాలకు వెళ్లే బస్సులు ఎక్కితే మడ్డువలస చేరుకోవచ్చు. ఇదే ప్రాంతానికి నిత్యం ఆటోల సర్వీసు అందుబాటులో ఉంటుంది.



వంగర: కొండల నడుమ రిజర్వాయరు నీటి అందాలు



పాండవుల పంచ



పిక్నిక్‌ల నిర్వహణకు అనువైన పచ్చని తోటలు

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం కావాలి



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ ఈవో మోహన్‌రావు

బాడంగి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం కావాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు పనిచేయాలని బొబ్బిలి డిప్యూటీ ఈవో మోహన్‌రావు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలను శనివారం ఆకస్మికంగా సందర్శించిన ఆయన.. రికార్డులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల విద్యాసామర్థ్యాలను అంచనా వేశారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలని, నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం కూడా విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. అపార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఆయన వెంట ఎంఈవో-2 రాజ్వేరి తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

రాజాం సిటీ: రాజాం నియోజకవర్గ ఎస్సీ వెల్ఫేర్ నూతన కార్యవర్గం ఎన్నిక మండల కేంద్రంలో శనివారం జరిగింది. గౌరవాధ్యక్షుడిగా టి.బలరాం, అధ్యక్షుడిగా ధర్మాన కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా బోనెల గౌరీశ్వరరావు, కోశాధికారిగా కలమట జగన్నాథంలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు ఉపాధ్యక్షుడిగా డి.సుదర్శన్, జాయింట్ సెక్రటరీగా బత్తిన సురేష్, మీడియా కన్వీనర్లుగా జి.సూర్యనారాయణ, బి.తిరుపతి, టి.మోహన్‌లు కూడా ఎన్నికయ్యారు. అనంతరం సభ్యులతో ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన బొత్స జానకీరావు, కంబాల సుదర్శన్‌లు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జె.నీలయ్య, ఎస్.తవిటయ్య, ఎ.తవిటిరావువ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నీలావతి

రేగిడి: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్‌ఐ పి.నీలావతి సూచించారు. మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద వాహనదారులు, ప్రయాణికులను ట్రాఫిక్ నిబంధనలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె.. మద్యం సేవించి, ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు. ఆటోల్లోకి పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై 'కూటమి' దాడులకు వ్యతిరేకంగా నిరసన

బొబ్బిలి: రాష్ట్రంలోని దళితులపై కూటమి ప్రభుత్వం చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా డిసెంబరులో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపట్టనున్నట్లు అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య తెలిపారు. ఇదే విషయమై ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఎంపీలు, ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారు కూడా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌తో పాటు దళితులపై అసభ్యకర పదజాలంతో దూషణలు, దాడులకు ఎగబడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను విక్రయిస్తుండడం వల్ల దళితులకే ఉద్యోగావకాశాలు తగ్గాయన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుకునే వసతిగృహాలు పశువుల దొడ్ల కన్నా హీనంగా ఉన్నాయని, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

బుడా చైర్మన్‌గా తెంటు

బాడంగి: బుడా(బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) చైర్మన్‌గా మండలంలోని ముగడ గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు నియమితులయ్యారు. ఆయన నియామకం పట్ల పలువురు టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అపార్ నమోదును వేగవంతం చేయాలి

రాజాం: విద్యార్థుల వివరాల నమోదుకు సంబంధించి, చేస్తున్న అపార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంఈవో బి.ప్రవీణ్‌కుమార్ సూచించారు. శనివారం స్థానిక పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలలను పరిశీలించిన ఆయన.. అపార్ నమోదుపై ఆరాతీసి, పలు సూచనలు చేశారు.

ప్రజాసమస్యలు పరిష్కరించాలి



వీఆర్వోలకు సూచనలిస్తున్న తహసీల్దారు సులోచనరాణి

రామభద్రపురం: చిత్తశుద్ధితో ప్రజాసమస్యలు పరిష్కరించాలని తహసీల్దారు సులోచనరాణి సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శనివారం ఆమె వీఆర్‌వోలతో సమావేశమై, పలు సూచనలు చేశారు. ప్రజల నుంచి వచ్చిన వివిధ అర్జీలను 15 రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు. న్యాయపరమైన సమస్యలు పరిష్కరించడంలో తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఇదిలా ఉండగా, పనిభారం తగ్గించాలని తహసీల్దార్ సులోచన రాణిని వీఆర్వోలంతా కోరారు.

మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్



పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని మధ్యాహ్న భోజనం పథకం వంట నిర్వాహకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయమై రామభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని వంట నిర్వాహకులు శనివారం ఆందోళన చేపట్టారు. విద్యార్థులకు రుచి, శుచి కలిగిన ఆహారం అందివ్వాలంటే మెనూ చార్జీలు పెంచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అలాగే కుకింగ్ చార్జీలు కూడా పెంచాలని కోరారు. పాఠశాలలు పునఃప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా మెనూ, కుకింగ్ చార్జీలపై ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయకపోవడం చాలా దారుణమన్నారు.

– రామభద్రపురం

ఆకట్టుకున్న వేషధారణలు



రాజాం మండలం, కంచరాం తృప్తి రిసార్ట్‌లో శనివారం జరిగిన ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ కార్తీక వనసమారాధనలో పలువురు వేసిన పౌరాణిక నాటకాల్లోని వేషధారణలు ఆకట్టుకున్నాయి. అసోసియేషన్ ఏర్పడి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అంతరించిపోతున్న కళలను ఒకసారి గుర్తుచేసేలా ఉన్న వారి వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

– రాజాం సిటీ

సక్రమంగా సర్వే చేపట్టాలి



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం: మరుగుదొడ్లకు సంబంధించిన సర్వేను సక్రమంగా చేపట్టాలని ఎంపీడీవో శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని పెనుబాక గ్రామంలో శనివారం చేసిన ఇంటింటా సర్వేను ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. బహిరంగ మలవిసర్జనను రూపుమాపడమే లక్ష్యంగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో సిబ్బంది పక్కాగా సర్వే చేసి, వివరాలు నమోదు చేయాలని ఆయన తెలిపారు.

రాజాం సిటీ: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇంటింటా సర్వేను సమగ్రంగా చేపట్టాలని ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వీవోలతో శనివారం సమావేశమైన ఆయన.. గ్రామాల్లో ఇంటింటా మరుగుదొడ్ల వినియోగంపై చేపడుతున్న ఈ సర్వే వేగవంతం చేయాలని తెలిపారు. సర్వేను పారదర్శకంగా చేయాలన్నారు.

బాడంగి: మండలంలో జరుగుతున్న శానిటేషన్, హౌస్‌హోల్డ్ సర్వేను ఎంపీడీవో ఎస్.రామకృష్ణ పరిశీలించారు. 12వ తేదీలోగా సర్వే పూర్తి చేయాల్సి ఉన్నందున సర్వేను వేగవంతం చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కంచరాం విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాజాం: రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. కలిశెట్టి అఖిల, కురుమోజు లావణ్య, అలజంగి సంతోషిణి, బత్తిన అంజలి, పోతురెడ్డి సత్యవతిలు అండర్-17 బాలికల విభాగంలో క్రీడాపోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం వీవీ వసంతరావు తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా తరఫున వీరంతా ఈ రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు టి.దుర్గారావు, పి.బంగార్రాజులు వెల్లడించారు. శనివారం సదరు విద్యార్థులు పాఠశాల నుంచి పోటీలకు పయనమయ్యారు.

ఓటరుగా నమోదు కావాలి



బొబ్బిలి రూరల్: పారాది పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీవో రామ్మోహనరావు

బాడంగి/బొబ్బిలి/బొబ్బిలి రూరల్: మండలాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం శనివారం నిర్వహించారు. గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించిన అధికారులు అక్కడి బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. అలాగే కొత్తగా ఓటుహక్కు కోసం పలువురు చేసుకున్న దరఖాస్తులు, ఓటర్ల జాబితాలోని తప్పులను సవరించుకునేందుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. 18 ఏళ్ల వయసు నిండిన వారంతా ఓటరుగా నమోదు కావాలని కోరారు.

పంటకోత ప్రయోగం



ఉంగరాడలో పంటకోత ప్రయోగం చేస్తున్న సిబ్బంది

రేగిడి: మండలంలోని ఉంగరాడ గ్రామంలోని వరి పొలంలో పంటకోత ప్రయోగం శనివారం నిర్వహించారు. ఏవో జి.మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ ఏడాది ధాన్యం దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. గతేడాది వర్షాల ప్రభావంతో 20 నుంచి 25 బస్తాల ధాన్యం దిగుబడి మాత్రమే వచ్చిందని, ఈ ఏడాది అనుకూల వాతావరణం కారణంగా ఎకరాకు 30 నుంచి 32 బస్తాల ధాన్యం దిగుబడి రానుందని అంచనా వేశారు. ఆయన వెంట ఏఎస్‌వో ఏసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

